

# సైకియాట్రిక్ కథలు

## పనికిరానిదాన్ని

జలజ తెలుగులో ఎమ్మే డిగ్రీ తీసుకుంది. జూనియర్ కాలేజిలో లెక్చరరుగా పనిచేస్తోంది. తల్లిదండ్రులకి ఒక్కర్తే అమ్మాయి. కనుముక్కు తీరు బావుంటుంది. అమ్మాయి పెళ్ళి చేసి తమ బాధ్యత తీర్చుకుందామని తల్లిదండ్రులు అనుకుంటున్నారు. ఆ ప్రయత్నంలో భాగంగానే ఆరోజున పెళ్లిచూపులు జరుగుతున్నాయి.

పెళ్ళిచూపులకి వచ్చిన వరుడు ఎమ్.కామ్ చదివి బాంక్ ఆఫీసరుగా పని చేస్తున్నాడు. అతని అన్నగారు మెడిసన్ చదివి అమెరికాలో సెటిలయ్యాడు. ఆడపిల్లలు లేరు కాబట్టి ఆడపడుచుల బాధ లేదు. మామగారు మంచి ఆస్తిపరుడు. కన్యావరయతే రూపం, మాతా విత్తం, పితాశ్రుతం అన్నారు. కన్య వరుడిలో రూపాన్నీ, పెళ్ళికూతురి తల్లి ధనాన్నీ, తండ్రి చదువునీ కోరుకుంటారట. ఈ రోజుల్లో ఆ సూక్తి వర్తించదేమో కానీ పెళ్ళికొడుకులో చదువూ, అందమూ, డబ్బూ అన్నీ ఉన్నాయి. ఆడపెళ్ళివారికి నచ్చక పోయే ప్రసక్తిలేదు. మగపెళ్ళివారు చాలా మర్యాదస్థులలా కూడా ఉన్నారు. జలజ ఒక్కర్తే అమ్మాయి కాబట్టి కట్నం దగ్గర సంబంధం వీగిపోయే ప్రసక్తిలేదు.

పెళ్ళి చూపులయ్యాయి. ఇంకా సంబంధం కుదుర్చుకుందామని ఆడపెళ్ళివారు అనుకుంటూ ఉండగా జలజ ''నాన్నా, నాకీసంబంధం ఇష్టంలేదు'' అని బాంబు పేల్చింది. అందరూ ఖంగు తిన్నారు. ఎందుకిష్టం లేదని జలజని ప్రశ్నించారు.

''ఇష్టం లేదంతే. నాకు అతను నచ్చలేదు'' అంది జలజ.

''ఏం ఎందుకు నచ్చలేదు?''

''నచ్చకపోవడానికి కారణమేముంది? నాకు బీరకాయ కూర ఇష్టం లేదు. ఎందుకిష్టం లేదని ఎప్పుడైనా అడిగారా?''

పిల్లకిష్టం లేని సంబంధం ఎందుకులే అని జలజ అమ్మా, నాన్నా ఊరుకున్నారు.

ఆరాత్రి జలజ నిద్రపోలేదు. వాస్తవానికి ఆమెకు వరుడు నచ్చాడు. కానీ తనకి సంబంధం ఇష్టమని చెప్తేతల్లీ, తండ్రీ మగపెళ్ళి వాళ్ళింటికి వెడతారు. అప్పుడు వరుడు తనకి పిల్ల నచ్చలేదంటాడేమో. తను అంత అందంగా ఉండదు. తెలుగులో ఎమ్మే చదివిందంతే అతను కోరుకుంటే ఏ డాక్టరో, బాంకు ఆఫీసరో దొరుకుతుంది. తనెందుకు చేసుకుంటాడు. అతను నచ్చలేదని చెప్పడానికి ముందు తనే అతను నచ్చలేదని చెప్పేసి మంచి పని చేసింది. లేకపోతే ఎంత అవమానం.

మంచిపని చేశాననుకున్న జలజ పెళ్ళికొడుకుని మర్చిపోలేకపోయింది. అతనితో వివాహమైనట్లు, అమెరికా హనీమూన్ వెళ్ళినట్లు కలలు కనసాగింది.

తరువాత జలజకు ఒక కలెక్టరు సంబంధం, ఒక డాక్టరు సంబంధం, ఒక ఇంజనీరు సంబంధం వచ్చాయి. మగపెళ్ళివారి కన్నా ముందుగా జలజే తనకి పెళ్ళికొడుకు నచ్చలేదని చెప్పేసింది. ఆ తర్వాత పెళ్ళిచూపులకి వచ్చినతనితో వివాహమైనట్లు, తను చాలా సుఖపడుతున్నట్లు కలలు కనేది.

పెళ్ళి చూపులయ్యాయి. ఇంకా సంబంధం కుదుర్చుకుందామని ఆడపెళ్ళివారు అనుకుంటూ ఉండగా జలజ ''నాన్నా, నాకీసంబంధం ఇష్టంలేదు'' అని బాంబు పేల్చింది. అందరూ ఖంగుతిన్నారు. ఎందుకిష్టం లేదని జలజని ప్రశ్నించారు.

వచ్చిన సంబంధమల్లా తిరగ్గొడుతోందని జలజకి పేరు వచ్చింది. ఆమెకి సంబంధాలు చెప్పడం మానేశారు. ఇంక అమ్మాయికి పెళ్ళి చెయ్యగలమా అని తల్లిదండ్రులు బెంగ పెట్టుకుంటున్న సమయంలో ఒక సంబంధం వాళ్ళు ''మీ అమ్మాయిని ఈ మధ్య ఒక పెళ్ళిలో చూశాము. మీకు ఇష్టమైతే మా కోడలుగా చేసుకుంటాం'' అని రాశారు.

జలజ తల్లిదండ్రులు సంబంధం గురించి పూర్తిగా తెలుసుకున్నారు. పెళ్ళికొడుకు సెక్రటేరియట్‌లో సెక్షన్ ఆఫీసర్. అంత అందంగా లేడు. పెళ్ళికొడుకు తల్లీదండ్రీ పల్లెటూరి రకంలా ఉన్నారు. సంబంధం వద్దని చెప్పేద్దామనుకుంటూంటే జలజ తనకు పెళ్ళికొడుకు నచ్చాడంది. ఎంత నచ్చచెప్పినా మనస్సు మార్చుకోలేదు.

పెళ్ళయినప్పటినుంచీ కలతలు ప్రారంభమయ్యాయి. జలజ అస్తమానం భర్తను విమర్శించేది. ఇంకా మంచి బట్టలు కట్టుకోకూడదా అనేది. వేరే ఉద్యోగానికి ప్రయత్నించమనేది. మీ అమ్మా, నాన్నల్ని చూస్తే నాకు నామోషీగా ఉందనేది. జలజ భర్తకి ఆమె ప్రవర్తన నచ్చలేదు. ''నా గురించి తెలిసే చేసుకున్నావుగా, ఇప్పుడు నన్ను మార్చడానికి ప్రయత్నించకు'' అనేవాడు ఇల్లు నరకమైంది.

కాలేజీలో కూడా తనకు సరైన సబ్జెక్టులు చెప్పడానికి ఇవ్వడం లేదని బాధపడేది జలజ. అందమైన వాళ్ళకీ, పలుకుబడి ఉన్నవాళ్ళకీ మంచి సబ్జెక్టులు ఇస్తారనుకునేది. తనతో ఎవరైనా మాట్లాడితే అది కేవలం మొహమాటం వల్లనేకానీ తనతో మాట్లాడడం ఆనందంగా ఉండడం వల్ల కాదనుకునేది.

జలజ ప్రవర్తనని భరించలేని భర్త ఆమెను సైకియాట్రిస్టు దగ్గరకు తీసికెళ్ళాడు. జలజ తన జీవిత కథ అంతా చెప్పింది. సైకియాట్రిస్టు ఆమెను ఆమె చదువుగురించిన వివరాలు అడిగాడు.

''కాలేజీలో బాగానే చదువుకున్నాను. అయితే నాకెప్పుడూ నేను బాగా చదువుతున్నానని అన్పించేది కాదు. మిగతావాళ్ళు తెలివైన వాళ్ళనిపించేది''

ఇంకొన్ని ప్రశ్నలడిగాక సైకియాట్రిస్టుకి జలజ వివాహ జీవితమూ, ఉద్యోగ జీవితమూ సరిగ్గా లేకపోవడానికి ఆమె నిరాశావాదమూ, తనని గురించి తను తక్కువగా అంచనా వేసుకోవడమూ, చిరకాలంగా ఉన్న డిప్రెషనూ కారణాలని అర్థమైంది. జలజకి తీవ్రమైన డిప్రెషన్ ఎప్పుడూ కలగలేదు. ఆమెది ప్రైమరీ టైప్ డిస్తెమియా అనీ, అది ఆమెకు చిన్నప్పుడే వచ్చిందనీ ఆయన నిర్ణయించాడు. తను సాధించాల్సిన విషయాల నుండి దూరంగా ఉండడం, తనను ఇష్టపడేవాళ్ళని దగ్గరకు రానివ్వకపోవడం, ఇతరులు తనని ఇష్టపడకుండా ఉండేలా ప్రవర్తించడం ఆమె లక్షణం.

సైకియాట్రిస్టు జలజకూ, ఆమె భర్తకీ విషయం చెప్పాడు. ఆమెకు కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ అవసరమౌతుందని చెప్పాడు.

సైకియాట్రిస్టు సూచనలను అనుసరించి జలజ తన ప్రవర్తనలో, దృక్పధంలో మార్పులు తెచ్చుకోసాగింది. ఆయన సలహా మేరకు యోగా, మెడిటేషన్ మొదలెట్టింది. జలజలో తనను తను తక్కువగా అంచనా వేసుకోవడం తగ్గింది. తన విజయాలకి తను సంతోషించడం ప్రారంభించింది. ఆమెలో భర్త పట్ల ప్రేమా, అత్తమామల మీద గౌరవమూ పెరిగాయి.

కొన్ని నెలలయ్యేసరికి జలజ తాను సంతోషంగా ఉండి, అందరినీ సంతోషంగా ఉంచడంలో కృతకృత్యురాలైంది.

-పాలంకి సత్య